క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



దోమకొండ: బీబీపేట మండలంలోని కొనాపూర్ గ్రామానికి చెందిన చేప్యాల రాజేందర్, మల్కాపూర్ గ్రామానికి చెందిన యాదగిరిరెడ్డి కుటుంబసభ్యులకు రూ.5 లక్షల చొప్పున చెక్కులను మంగళవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అందజేశారు. చేప్యాల రాజేందర్‌తో పాటు యాదగిరిరెడ్డిలు గత ఏడాది క్రితం విద్యుత్‌షాక్‌తో మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున దోమకొండలో చెక్కులను అందజేశారు.

కిడ్నీ బాధితుడికి ఎల్‌వోసీ..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): లింగంపేట మండలం జల్దిపల్లికి చెందిన అల్లం రవికి రెండు కిడ్నీలు చెడిపోవడంతో ఎమ్మెల్యే జాజాల సురేందర్, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.5 లక్షల ఎల్‌వోసీ చెక్కును మంజూరు చేయించినట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. మంగళవారం బాధితుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్‌వోసీ చెక్కును అందించారు. నాయకులు సత్యం, సిద్దు తదితరులున్నారు.

వసతుల్లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మౌలిక వసతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలల ప్రభుత్వ గుర్తింపును రద్దు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఏవో సరళాబాయికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వినోద్, గణేష్ తదితరులున్నారు.

వైకుంఠ రథం వితరణ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుప్రియాల్‌లో గ్రామానికి చెందిన రైతుబంధు మండలాధ్యక్షుడు ఏలేటి భూంరెడ్డి తన తండ్రి రాజారెడ్డి జ్ఞాపకార్థం గ్రామానికి వైకుంఠ రథం వితర చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ కొబ్బరియ కొట్టి రథాన్ని గ్రామ పంచాయతీకి అప్పగించారు. భూంరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. జెడ్పీటీసీ కమిలి నర్సింలు, సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీ ఏలేటి స్వరూప భూంరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సర్పంచ్‌లు బద్దం శ్రీనివాస్ రెడ్డి, రాజనర్సు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రుద్రారంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో మత్తమాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. సర్పంచ్ సత్తయ్య, ఆరోగ్య సిబ్బంది శారద, సాయవ్వ ఉన్నారు.

ప్రత్యేక బోధన చేపట్టాలి



పిట్లం(జుక్కల్): రాంపూర్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన చేపట్టాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం బ్రాహ్మణపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మధ్యాహన భోజనం నాణ్యతతో ఉండే విధంగా చూడాలని అన్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లకు అడ్మిషన్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సుధాకర్ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వారు పాఠశాలకు సర్టిఫికెట్లతో ఈనెల 15లోగా రావాలని కోరారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- ఆరోగ్య మహిళ కేంద్రం ప్రారంభం

లింగంపేట/సదాశివనగర్(ఎల్లారెడ్డి): మహిళల ఆరోగ్యానికి భద్రత కల్పించడానికే కేసీఆర్ ప్రభుత్వం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ తెలిపారు. మంగళవారం ఆయన లింగంపేట, సదాశివ నగర్ పీహెచ్‌సీలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు పైబడిన మహిళలకు 8 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా చికిత్స అందించే విధంగా చూడడానికి ఈ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ మంగళ వారం జరిగే ఆరోగ్య మహిళ కార్యక్రమానికి పీహెచ్ సీలకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చికిత్స పొందుతున్న మహిళలను పలకరించారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు మహిళలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. లింగంపేట ఎంపీపీ గరీబున్నిసాబేగం, సర్పంచ్ బొల్లు లావణ్య, వైస్‌ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచులు రాజయ్య, సదాశివనగర్ ఎంపీపీ గైని అనసూయ, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, జెడ్పీ కో–ఆప్షన్ మోహినొద్దీన్, సర్పంచ్‌లు బద్దం శ్రీనివాస్ రెడ్డి, రాంరెడ్డి, అంజు, తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల



లింగంపేటలో ఆరోగ్య మహిళ కేంద్రాన్ని ప్రారంభిస్తూ..

ప్రభుత్వ విప్ ఇంటి ఎదుట ధర్నా

కామారెడ్డి టౌన్: తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇంటి ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలన్నారు. పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే పీఏ శ్రీధర్‌కు అందజేశారు. యూనియన్ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ అలీ, ఉపాధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

విద్యా శాఖలో విలీనం చేయాలని డిమాండ్



కామారెడ్డి టౌన్: తమను రెగ్యులరైజ్ చేయాలని, విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె మంగళవారానికి 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ వెళ్లి అక్కడ మానవహారం ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని, న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని ఉద్యోగులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు దామోదర్, సత్యనారాయణ, శ్రీధర్ కుమార్, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏకాగ్రత పొందటానికి ధ్యానమే సాధనం

కామారెడ్డి రూరల్: మనశ్శాంతికి మార్గం సరస్వతీ మంత్రమని విద్యార్థులు ప్రతి రోజు ఉదయం సరస్వతీ మంత్రాన్ని జపించాలని శ్రీ రామకోటి జపలిఖిత ప్రచారకుడు శ్రీ కృష్ణానందస్వామి సూచించారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ధ్యాన యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, రాధ, సత్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధ్యాన యోగ కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీ కృష్ణానందస్వామి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాజంపేట: శివాయిపల్లిలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్ శంకుస్థాపన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు జితేష్ వి పాటిల్, స్థానిక సర్పంచ్ ఏనుగు విఠల్ రెడ్డి, ఎంపీటీసీ బాలరాజు గౌడ్, ఎంపీపీ స్వరూప, జెడ్పీటీసీ కొండ హన్మండ్లు, సొసైటీ చైర్మన్ నల్లవెల్లి అశోక్, వైస్ చైర్మన్ రమేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

చిన్నమల్లారెడ్డివాసికి డాక్టరేట్

కామారెడ్డి రూరల్: చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన పర్వయ్యగారి భాస్కర్ రావు ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. జుక్కల్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న భాస్కర్ రావు 'తెలంగాణ సామెతలు జన చిత్రణ' అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డాక్టర్ కె. చంద్రశేఖర రావు పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసుకుని గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. తెలంగాణ ప్రాంతాల్లో సేకరించిన సామెతలకు వివరణాత్మకంగా నివేదిక సమర్పించి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనా తనయుడు డాక్టరేట్ పట్టా అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా గ్రామస్తులతో పాటు కామారెడ్డి మండలవాసులు భాస్కర రావును అభినందిస్తున్నారు.



ఘనంగా బోనాల పండుగ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లిలో గంగమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సంఘం గ్రామ అధ్యక్షుడు జోడు పోచయ్య ఇంటి నుంచి గంగాబోనంతో పాటు ముదిరాజ్ మహిళలు నెత్తిన ఎత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించి భక్తులు వారి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ దేశబోయిన సాయిలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ పదోన్నతులను మాన్యువల్ పద్ధతిలో నిర్వహించాలని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పదోన్నతుల్లో నాట్ విల్లింగ్ ఆప్షన్ పొందుపర్చాలని అన్నారు.పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు టి. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సీహెచ్. చక్రపాణి, రాష్ట్ర కౌన్సిలర్ డాక్టర్ నాగభూషణం పాల్గొన్నారు.

హిందూవాహిని ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతం



బిచ్కుందలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యువకులు

బిచ్కుంద(జుక్కల్): తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని కించపరిచి మాట్లాడినందుకు నిరసనగా హిందూవాహిని సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బిచ్కుంద బంద్‌కు పిలుపునిచ్చారు. దుకాణాలు, హోటళ్లు స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉదయనిధి దిష్టిబొమ్మను దహనం చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడినందుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బజరంగ్‌దళ్ నాయకులు మంగళవారం తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు తులసి, ప్రసాద్, సాయిబాబా తదితరులున్నారు.



ఎల్లారెడ్డిలో.. బజరంగ్‌దళ్ నేతలు

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మండలం అడివిలింగాలలో పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మదన్‌మోహన్, కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. కొక్కొండ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సంతోష్ కుటుంబానికి పీసీసీ ఉపాధ్యక్షులు మదన్‌మోహన్ నగదు సాయం అందించారు. శివాగౌడ్, జనార్ధన్, నాగరాజు తదితరులున్నారు.



మదన్‌మోహన్ సమక్షంలో చేరుతున్న నేతలు

కట్టకింది తండాలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కట్టకింది తండాలో పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ సమక్షంలో మంగళవారం పలు పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మదన్‌మోహన్ కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరుతున్నారని మదన్‌మోహన్ అన్నారు.

డీఈఈ కార్యాలయం ఏర్పాటు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం పీఆర్ డీఈఈ కార్యాలయాన్ని ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ కమిలి నర్సింలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రానికి పీఆర్ డీఈఈ కార్యాలయాన్ని మంజూరు చేయించడం ఎంతో గర్వంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ రవి, ఎంపీటీసీ బీరయ్య, బీఆర్‌ఎస్ నేత మహేందర్ రెడ్డి, డీఈఈ వీరానంద రావు, ఏఈ మారుతి పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



పిట్లంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడి సిబ్బంది



బీబీపేటలో ..

సాక్షి, నెట్‌వర్క్: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడి సిబ్బంది చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. అంగన్‌వాడి టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అంగన్‌వాడీలు సమ్మెలో ఉండటంతో అంగన్‌వాడి కేంద్రాల తాళాలను అధికారులు దగ్గరుండి పగల కొట్టించారు. నిర్వహణ బాధ్యతలను వీవోఏలకు, డ్వాక్రా సంఘం సీఏలకు అప్పగించారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారని మంగళవారం పలు పోలీస్‌స్టేషన్లలో అంగన్‌వాడీ టీచర్లు ఫిర్యాదు చేశారు.



బిచ్కుందలో ఎస్సైకు ఫిర్యాదు చేస్తున్న సిబ్బంది



మద్నూర్ పోలీస్ స్టేషన్‌లో..



బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో..



బాన్సువాడలో అంగన్‌వాడీ కేంద్రం తాళం పగలగొట్టిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

వీవోఏల సేవలు భేష్!

భిక్కనూరు: అంగన్‌వాడి టీచర్లు సమ్మె చేయడంతో అంగన్‌వాడి కేంద్రాలను ఐకేపీ వీఏవోలతో నడిపిస్తున్నామని, బాలింతలు గర్భిణులలకు వీరు అందిస్తున్న సేవలు భేషుగ్గా ఉన్నాయని మండల పంచాయతీ అధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 13 అంగన్‌వాడి కేంద్రాలను ఆయన ఈవో సదాశివతో కలిసి పరిశీలించారు. బియ్యం, పప్పు, నూనె, గుడ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి కేంద్రాలను నిర్వహిస్తున్న వీవోఏలను ఆయన అభినందించారు.



పౌష్టికాహారాన్ని అందించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అంగన్‌వాడి కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంగ్రామంలో గల అంగన్‌వాడీకేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పలురికార్డులను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరీబాయితో కలిసి ఆయన పరిశీలించారు.

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయం ఎదుట మంగళవారం అంగన్‌వాడీలు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆయన వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస వేతనం, ఉద్యోగ భద్రతతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. దనుంజయ్, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): అంగన్‌వాడి ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీజేఎస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి నిజ్జన రమేశ్ డిమాండు చేశారు. మంగళవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శిబిరంలో మాట్లాడారు. ఉద్యోగులకు టీజేఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.



చోరీ కేసులు నమోదు చేయాలి

భిక్కనూరు: సమ్మె బాట పట్టిన అంగన్‌వాడి టీచర్లను భయభ్రాంతులకు గురిచేసి అంగన్‌వాడి కేంద్రాల తాళాలను పగులగొట్టిన అధికారులపై చోరీ కేసులు పెట్టాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలో దీక్షలో పాల్గొన్నారు.

సంక్షిప్తం

బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దిష్టిబొమ్మల దహనం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మంగళవారం బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. 7 శాతం ఉన్న అగ్రవర్ణాల వారు దేశంతో పాటు, పలు రాష్ట్రాలలో అధికారంలో ఉన్నారని, 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల వారికి అధికారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మణ్, సాయిబాబా, రాజశేఖర్ ఉన్నారు.

పంటల పరిశీలన

గాంధారి(ఎల్లారెడ్డి): పోతంగల్ కలాన్ శివారులో మంగళవారం క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించినట్లు ఏవో నరేష్ తెలిపారు. పంటల రక్షణ, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంబంధిత రైతులకు సూచించినట్లు చెప్పారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు తీర్మానాలు

భిక్కనూరు: గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తిప్పాపూర్, మోటాట్‌పల్లి గ్రామాల్లో రెడ్డి సంఘాల సభ్యులు తీర్మానం చేశారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని రెడ్డి సంక్షేమ సంఘ భవనాల్లో సమావేశమైన రెడ్డి కులస్తులు ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రతిజ్ఞచేశారు. తీర్మాన పత్రాలను రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర కోర్ కమిటీ చైర్మన్ నాగర్తి చంద్రారెడ్డికి అందజేశారు. రెడ్డి సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, వంగేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

స్పీకర్ కృషితోనే ఇబ్రహీంపేట్ తండా అభివృద్ధి

బాన్సువాడ రూరల్: శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషితోనే ఇబ్రహీంపేట్ తండా ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడి అభివృద్ధి సాధిస్తోందని ఆ గ్రామ సర్పంచ్ ప్రేమ్‌సింగ్, గ్రామపెద్దలు అన్నారు. మంగళవారం వారు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తండా అభివృద్ధిపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తామని మద్దతు లేఖలను అందజేశారు. సర్పంచ్‌లు ప్రేమ్‌సింగ్, మాలెపు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో హమారీ మిట్టి, హమారీ దేశ్

ఎల్లారెడ్డి: మండలంలోని పలు గ్రామాలలో బీజేపీ నాయకులు మంగళవారం హమారీ మిట్టీ, హమారీ దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి మట్టి సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు బాలకిషన్, బైండ్ల పోచయ్య, సాయిబాబా, సతీష్ ఉన్నారు.

నిత్యం పారిశుద్ధ్య పనులు చేయించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులను చేయించాలని నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. రాఘవపల్లి జీపీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, కార్యదర్శి క్రిష్ణమూర్తి ఉన్నారు.